సాక్షి కామారెడ్డి

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



రోడ్లకు మరమ్మతులేవీ?

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- IIIలో ▸



డిపాజిట్ల పేరిట టోకరా

డిపాజిట్ల పేరిట 125 మంది నుంచి రూ. 8.5 కోట్లు వసూలు చేసిన ఇద్దరిని నిజామాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.1 /21.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు అంగన్‌వాడీల చలో హైదరాబాద్



బాన్సువాడ : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గురువారం నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు ఖలీల్ పిలుపునిచ్చారు. బుధవారం బాన్సువాడ సీడీపీవో సౌభాగ్యను కలిసి 25న అంగన్‌వాడీ కేంద్రాల బంద్ నోటీసును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 24 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. చలో హైదరాబాద్‌కు అంగన్‌వాడీ టీచర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు మాధవి, ప్రతినిధులు గౌరీ, శివగంగ, సునీత తదితరులు పాల్గొన్నారు.

యాప్ ద్వారా విద్యుత్ సేవల సమాచారం

కామారెడ్డి అర్బన్: విద్యుత్ వినియోగదారులు సత్వర సేవలు పొందడానికి టీజీఎన్‌పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మొబైల్ ఫోన్ ప్లేస్టోర్‌లో యాప్ ఉందని పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1912తో పాటు 1800 425 0028 నంబర్లలోనూ విద్యుత్ సేవల కోసం సంప్రదించవచ్చని సూచించారు.

'వేతనాలు చెల్లించాలి'



తాడ్వాయి: ప్రజలకు పనులు కల్పిస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ కృష్ణ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై బుధవారం ఎంపీడీవో సాజిద్ అలీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నరగా నాలుగు నెలలకోసారి వేతనాలు ఇస్తున్నారన్నారు. ఈసారి ఐదు నెలలైనా వేతనాలు రాలేదని పేర్కొన్నారు. పండుగలోపు వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఉద్యోగ సంఘాల నాయకులు స్వామి, రామకృష్ణ, రేఖ, రాణి తదితరులున్నారు.


నేడు దసరా ఉత్సవం

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని దేవునిపల్లి మల్లికార్జున స్వామి కల్యాణ మండపంలో గురువారం ఉదయం 9 గంటలకు విజయదశమి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు సిద్ధిరాములు, శివరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన సంఘ్ ఇందూర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ విజయ్‌భాస్కర్ కృష్ణశాస్త్రి పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

జీజీహెచ్‌లో హైరిస్క్ గర్భిణీకి ప్రసవం



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హైరిస్క్‌లో ఉన్న గర్భిణీకి వైద్యులు ప్రసవం చేశారు. కోటగిరికి చెందిన 23 ఏళ్ల సిమ్రాన్‌బేగం ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండి బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. 37 వారాల 4 రోజుల గర్భంతో ఉండి ప్రసవ వేదన అనుభవిస్తున్న సిమ్రాన్‌బేగంకు జీజీహెచ్ వైద్యులు రెండు యూనిట్ల ఆర్డీపీ, ఒక యూనిట్ ఎస్డీపీ ప్లేట్‌లెట్ ట్రాన్స్‌ఫ్యూషన్ ఇచ్చారు. ఆ తరువాత ఆమెకు ప్లేట్‌లెట్ కౌంట్ 57,000కు పెరిగింది. వైద్య బృందం సకాలంలో స్పందించి సిమ్రాన్‌బేగంకు చికిత్స అందించడంతో ఆమె మొదటికాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డల ప్రాణాలను రక్షించిన హౌస్ సర్జన్ హేమంత్, వైద్యులు లక్ష్మీప్రసన్న, హారిక, ఆశ్రిత, రమ్య, రశ్మితకు సిమ్రాన్ బేగం భర్త మహ్మద్ రసూల్‌తోపాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ఆయకట్టుకు భరోసా

ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద లక్షన్నర ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. ప్రాజెక్టు నిండుకుండలా ఉండడంతో ఆయకట్టుకు రెండు పంటలకూ భరోసా లభించింది. గతంలో ఒక్కోసారి సరైన వర్షాలు లేక ప్రాజెక్టు నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరి పంటలకు నీరందించడం ఇబ్బందికరంగా ఉండేది. ఈసారి వర్షాకాలం పంటలు చాలావరకు పొట్ట దశలో ఉన్నాయి. కొన్నిచోట్ల కోతకు వచ్చాయి. ఇప్పటికీ ప్రాజెక్టు నిండుగా ఉండడం, పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లో వస్తుండడంతో వచ్చే యాసంగితో పాటు తరువాతి వర్షాకాలం పంటలకూ ఢోకా ఉండదన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

రికార్డుల వరద

- నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈ సీజన్‌లో 180 టీఎంసీల ఇన్‌ఫ్లో
- నెల రోజుల్లో గేట్ల ద్వారా 166 టీఎంసీలు విడుదల
- ఒకరోజు గరిష్ఠ ఇన్‌ఫ్లో 2.50 లక్షల క్యూసెక్కులు
- 40 ఏళ్లలో ఇదే అత్యధికమంటున్న అధికారులు

ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి రికార్డు స్థాయిలో వరదలు వచ్చాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే 180 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా.. నెల రోజుల వ్యవధిలోనే 166 టీఎంసీల నీరు ఔట్‌ఫ్లో అయ్యింది. నాలుగు దశాబ్దాలలో ఈ స్థాయిలో వరదలు రావడం ఇదే మొదటిసారని అధికారులు పేర్కొంటున్నారు. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం 1923లో ప్రారంభమై 1931లో పూర్తయ్యింది. మంజీర నదిపై అచ్చంపేట గ్రామం వద్ద ఈ ప్రాజెక్టు కట్టారు. రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటితోపాటు బోధన్, నిజామాబాద్ పట్టణాల ప్రజలకు తాగు నీటిని అందించేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం అప్పట్లో 1,400 అడుగులు(29.5 టీఎంసీలు). పూడికతో ప్రాజెక్టు సామర్థ్యం తగ్గిపోతూ రావడంతో 1975లో ఎఫ్ఆర్ఎల్ లెవన్‌ను 4.5 అడుగులకు పెంచారు. దీంతో 1978 సంవత్సరం నుంచి ప్రాజెక్టు నీటిమట్టం 1,405 అడుగుల (17.8 టీఎంసీ)కు చేరింది. సుమారు వందేళ్ల చరిత్ర గల ఈ ప్రాజెక్టులోకి ఈసారి ఊహించనంతగా వరద వచ్చి రికార్డుల మీద రికార్డులు సృష్టించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 180 టీఎంసీల నీరు వచ్చి చేరిందని నీటి పారుదల శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇంత స్థాయిలో నీరు వచ్చింది ఇదే మొదటిసారని అధికారులు పేర్కొంటున్నారు. మంజీరపై సింగూరు వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించకముందు ఎప్పుడో వరద వచ్చిందని, గడచిన నలభై ఏళ్లలో ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో లేదని చెబుతున్నారు. గతనెల 18 న ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటిని వదలడం మొదలవగా మధ్యలో ఒకటి రెండు రోజులు మినహా నేటి వరకు వదులుతూనే ఉన్నారు. ఇప్పటివరకు 166 టీఎంసీల నీటిని వరద గేట్ల ద్వారా దిగువకు వదిలారు.

నిజాంసాగర్ ప్రాజెక్టుకు నాలుగు దశాబ్దాల కాలంలో ఈసారి వచ్చిన ఇన్‌ఫ్లోనే అత్యధికమైనదని నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతనెల 28న నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 2,50,912 క్యూసెక్కుల నీరు

గతనెల 28న భారీగా..

వచ్చింది. దీంతో 2.20 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఒక రోజులో ఈ స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం, ఔట్‌ఫ్లో వెళ్లడం ఇదే మొదటిసారి అధికారులు తెలిపారు. సింగూరు నుంచి మంజీర పరవళ్లు తొక్కుతూ రాగా.. పోచారం ప్రాజెక్టు నుంచి కూడా భారీ వరద వచ్చింది.

ఎప్పుడూ లేనంతగా వరద..

నిజాంసాగర్ ప్రాజెక్టుకు గతంలో ఎన్నడూ లేనంతగా ఇన్‌ఫ్లో వచ్చింది. దాదాపు అదే స్థాయిలో నీటిని దిగువకు వదిలాం. దాదాపు నలభై ఏళ్ల చరిత్రలో ఇదే ఎక్కువ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో. ఎప్పటికప్పుడు ఇన్‌ఫ్లోను, ప్రాజెక్టును పర్యవేక్షిస్తూ ఎక్కడా నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నాం. ఎగువన అలాగే దిగువన ముంపు సమస్య తలెత్తకుండా ప్రజల్ని అప్రమత్తం చేశాం.
– టి.శ్రీనివాస్, చీఫ్ ఇంజినీర్, కామారెడ్డి

జీవనదిలా మంజీర

ఎగువన వర్షాలు కురుస్తూనే ఉండడంతో మంజీర జీవనదిలా మారింది. గడచిన 38 రోజులుగా నది పారుతూనే ఉంది. వర్షాలు పడుతుండడంతో మంజీర మరికొన్ని రోజులు పారే అవకాశం ఉంది. ఎగువన మెదక్, సంగారెడ్డి జిల్లాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న భారీ వర్షాలతో మంజీర నదికి వరద తగ్గడం లేదు. బుధవారం 70,328 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. పది గేట్ల ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు.

'స్థానిక' రిజర్వేషన్లు ఫైనల్!

స్థానిక సంస్థలకు సంబంధించి రిజర్వేషన్ల జాబితా ఫైనల్ అయ్యింది. జెడ్పీ చైర్మన్ పదవిని రాష్ట్ర స్థాయిలో ఖరారు చేశారు. జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులతో పాటు ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు రూపొందించిన రిజర్వేషన్ల జాబితాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో బుధవారం ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.
– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి



- గోప్యత పాటిస్తున్న అధికారులు
- ఫలానా స్థానం ఫలానా వర్గానికి రిజర్వ్ అయ్యిందంటూ ప్రచారం
- రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ

పంచాయతీ వార్డు స్థానాల రిజర్వేషన్లపై ఎంపీడీవోల ఆధ్వర్యంలో, సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు ఆర్డీవోల స్థాయిలో, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో కసరత్తు జరిగింది. అధికారులు ఖరారు చేసి ఇచ్చిన రిజర్వేషన్ల జాబితాలను కలెక్టర్ ఒకటికి రెండుసార్లు పరిశీలించి వాటిని ఉన్నతాధికారులకు నివేదించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల నిర్వహించిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా బీసీలకు సీట్లు రిజర్వు చేశారని సమాచారం.

ఇతర రిజర్వేషన్లు అన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లను అధికారులు ఫైనల్ చేసినా.. గోప్యత పాటిస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారు విషయం లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే ఏ స్థానం ఏ వర్గానికి రిజర్వ్ అయ్యిందన్న దానిపై రాజకీయ పార్టీల నేతలు తెలుసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియలో భాగమైన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ సీరియస్‌గా చెప్పడంతో వివరాలు చెప్పడానికి ఎవరూ ధైర్యం చేయడంలేదని తెలుస్తోంది.

జోరుగా చర్చలు..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్కారు కసరత్తు చేస్తుండడం, రిజర్వేషన్ల జాబితాను రూపొందించడంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. రిజర్వేషన్ల అంశం అంతటా చర్చనీయాంశంగా మారింది. ఆయా మండలాల్లో జనాభా ఆధారంగా ఫలానా మండలం ఫలానా వర్గానికి రిజర్వ్ కావచ్చని, ఫలానా జెడ్పీటీసీ స్థానం జనరల్ అయ్యిందని, ఎంపీపీ స్థానం బీసీలకు రిజర్వ్ చేశారని ఇలా రకరకాలుగా ప్రచారం జరుగుతోంది. కాగా కొన్ని మండలాల్లో అధికారుల ద్వారా రిజర్వేషన్ల వివరాలు లీక్ అయినట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా ప్రకటిస్తే గానీ రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

గత ఎన్నికల రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని..

2019లో జరిగిన మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్లను అధికారులు పరిశీలించారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రెండు టర్మ్‌లు ఒకే రిజర్వేషన్ ఉండాల్సింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టేసింది. గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్లలో దాదాపు అన్ని మారినట్లు తెలుస్తోంది. అప్పుడు జనరల్ అయిన స్థానం ఇప్పుడు ఇతర వర్గాలకు రిజర్వ్ అయినట్లు సమాచారం. ఇలా జిల్లాలోని ఆయా మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో చాలావరకు గత ఎన్నికల్లో ఉన్న రిజర్వేషన్లలో మార్పులు జరిగాయని సమాచారం. అలాగే ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకూ రొటేషన్‌లో మార్పు జరిగినట్లు తెలుస్తోంది.

కేకేవై రహదారిపై భారీ గుంత


కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై మాచారెడ్డి వద్ద ప్రమాదకరంగా మారిన గుంత

మాచారెడ్డి: కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై మాచారెడ్డి మండల కేంద్రంలో ఏర్పడిన గుంత ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ రహదారిపై ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో రోడ్డును తవ్వి పైపులైన్‌ను లీకేజీని సరి చేశారు. అయితే రోడ్డును అలాగే వదిలేశారు. భారీ వాహనాల రాకపోకలతో గుంత రోజురోజుకూ పెరిగిపోయి ప్రమాదాలకు కారణమవుతోంది. అధికారులు రోడ్డుపై ఉన్న గుంతను సరి చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

ప్రాసెసింగ్ యూనిట్ల కోసం స్థలాల పరిశీలన


మద్నూర్ మార్కెట్ కమిటీ వద్ద స్థానిక నేతలనుంచి వివరాలు తెలుసుకుంటున్న శాస్త్రవేత్తల బృందం

నిజాంసాగర్/మద్నూర్: సోయా, పప్పుదినుసుల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం శాస్త్రవేత్తల బృందం బుధవారం మద్నూర్, జుక్కల్‌లలో పర్యటించింది. పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య, వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్‌లు వారికి స్థలాలను చూపించారు. ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు స్థలాలతో పాటు మద్నూర్ మార్కెట్‌లోని గోదాములను పరిశీలించారు. సోయా పంటపై ఆరా తీశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోయా, పప్పుదినుసుల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకోసం కృషి చేస్తున్నారని పిట్లం ఏఎంసీ చైర్మన్ మనోజ్‌కుమార్ అన్నారు. స్థల పరిశీలనకు వచ్చిన బృందంలో ఇక్రిశాట్ సీనియర్ అధికారి తమిర్ సెల్వి, అసిస్టెంట్ మేనేజర్ ప్రియాంక, రీసెర్చ్ అసోసియేషన్ టీం మేనేజర్ రాజశేఖర్, సభ్యులు సురేష్‌కుమార్, గంగారాం తదితరులున్నారు.

సోయాపై రైతుల్లో ఆశలు!

- జిల్లాలో 80,476 ఎకరాల్లో పంట సాగు
- అనుకూలించిన వర్షాలు.. దిగుబడి పెరుగుతుందని ఆశాభావం
- పక్షం రోజుల్లో చేతికందనున్న పంట

మద్నూర్: జిల్లాలో సోయా పంట ఆశాజనకంగా ఉంది. మరో పక్షం రోజుల్లో కోతకు రానుంది. పంట బాగుండడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఈసారి 80,476 ఎకరాల్లో సోయా పంట సాగయ్యింది. మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, డోంగ్లీ మండలాల్లో రైతులు అధికంగా ఈ పంట పండిస్తున్నారు. జిల్లాలో 60 శాతం వరకు సోయా పంట ఇక్కడే పండుతుంది. కాలం అనుకూలంగా ఉండడంతో పంట ఏపుగా పెరిగింది. ఈసారి పెద్దగా తెగుళ్ల బెడద కూడా లేకపోవడంతో కాత బాగుంది. మరో పక్షం రోజులు వాతావరణం అనుకూలిస్తే గట్టెక్కినట్లేనన్న అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

భారీగా కాత..

సోయాబీన్ విత్తనాలు వేసిననాటి నుంచి కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేశాయి. సోయా పంటకు కావాల్సినంత నీరందడంతో ఏపుగా పెరిగింది. ఈసారి భారీగా కాత కాసింది. మోకాలి ఎత్తులో ఉన్న సోయా పంట కళకళలాడుతోంది. పక్షం రోజుల్లో కోతలు ప్రారంభం కానున్నాయి. మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రావొచ్చని పేర్కొంటున్నారు.


మద్నూర్ శివారులో సాగవుతున్న సోయా

పంట బాగుంది



ఈసారి వర్షాలు బాగానే కురవడంతో సోయాబీన్ పంట బాగుంది. ప్రస్తుతం భారీ కాయలతో ఉంది. గుత్తులు గుత్తులుగా కాయలున్నాయి. వాటిని చూస్తే ఆనందం వేస్తోంది. మరో 15 రోజుల్లో పంట చేతికి అందనుంది. – దత్తు, రైతు, మద్నూర్

కోతలు మొదలవుతాయి..



జిల్లాలో సోయా పంట వేసి మూడు నెలలు అవుతోంది. ఈసారి పంట బాగా పెరిగింది. కాయలు కూడా బాగా కాశాయి. ప్రస్తుతం సోయకాయ దశలో ఎండుతోంది. మరో పదిహేను రోజుల్లో కోతలు మొదలవుతాయి. – రాజు, ఏవో, మద్నూర్

కిలో బంగారం పట్టివేత

ఖలీల్ వాడి: నిజామాబాద్ నగరంలో అక్రమంగా తరలిస్తున్న కిలో బంగారాన్ని పోలీసులు పట్టుకున్నారు. మూడో టౌన్ పోలీసులు బుధవారం తెల్లవారు జామున కంఠేశ్వర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆర్మూర్‌కు చెందిన బంగారు వ్యాపారులు సూర్యవంశీ సాంబాజీ, సురేష్ కారులో బంగారంతో పట్టుబడ్డారు. బంగారం కొనుగోలులో జీఎస్టీ కట్టినట్లు లేనందున, బంగారాన్ని వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు గానీ జీఎస్టీ అధికారులకు గాని అప్పగిస్తామని ఎస్సై హరిబాబు తెలిపారు. బంగారం విలువ సుమారు రూ. 1.10 కోట్లు ఉంటుందన్నారు. ఏసీపీ రాజావెంకట్ రెడ్డి విచారించినట్లు తెలుస్తోంది. వ్యాపారులు బంగారాన్ని నాందేడ్ నుంచి ఆర్మూర్‌కు తరలిస్తున్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: బస్తీ దవాఖానాలలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని హరిజనవాడ బస్తీ దవాఖానాను సందర్శించారు. వైద్య సేవలను, వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అధిక వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండి సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రితో పాటు ఆస్పత్రి పరిసరాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. బస్తీ దవాఖానా పక్కన నిర్మిస్తున్న బాలసదనం భవన నిర్మాణాన్ని పరిశీలించి, నాణ్యతతో వేగంగా భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జనార్దన్ తదితరులు ఉన్నారు.


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

క్లుప్తంగా

సెపక్ తక్రాలో జిల్లా విద్యార్థికి తృతీయ స్థానం


సాత్విక్

కామారెడ్డి అర్బన్: మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సెపక్ తక్రా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సాత్విక్ తృతీయ బహుమతి పొందినట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేష్ తెలిపారు. సాత్విక్ తృతీయ బహుమతి పొందడంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్‌పై సస్పెన్షన్ వేటు!

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్‌గా పని చేసిన గంగాకిశోర్‌పై బుధవారం గురుకులాల విద్యాలయాల ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల కాస్మొటిక్స్ బిల్లుల విషయంలో అలసత్వం ప్రదర్శించి బిల్లులు చెల్లించకపోవడంతో ఆయనను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పాఠశాలలో విధులను నిర్వర్తించడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు విద్యార్థులకు సరిపడా ఆహార సరఫరా, విద్యాపరమైన జవాబుదారీతనం లేకపోవడం, విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంతో సస్పెన్షన్ విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నూతన ప్రిన్స్‌పాల్‌గా సుధాకర్


ప్రిన్సిపల్ సుధాకర్

మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా సుధాకర్‌ను నియమిస్తునట్లు బుధవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. పోచంపాడ్‌లో పనిచేస్తున్న సుధాకర్ బుధవారం పోచంపాడ్‌లో రిలీవింగ్ ఆర్డర్ తీసుకున్నారు. మద్నూర్ గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఫుల్ అడిషనల్ చార్జ్‌పై ఇక్కడికి రానున్నారు. ఈయన గతంలో ఈ పాఠశాలలో పనిచేసి వెళ్లారు. గురువారం బాధ్యతలు చేపడుతున్నట్లు ఆయన సాక్షితో తెలిపారు.

మెప్మా పీడీ రాజేందర్ బదిలీ

నిజామాబాద్ సిటీ: మెప్మా పీడీ రాజేందర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయనను సంగారెడ్డి ఆర్డీవోగా నియమించారు. రెవెన్యూ విభాగానికి చెందిన రాజేందర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. తర్వాత పదోన్నతిపై మెప్మా పీడీగా నియమించడంతో దాదాపు రెండేళ్లు పనిచేశారు.

రామనే శ్రీరామ ఉయ్యాలో..


కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాల్లో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో రాజు, ఉద్యోగులు


నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

సాక్షి నెట్‌వర్క్:రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. రామ రామ నంది ఉయ్యాలో.. రాగమెత్త రాదు ఉయ్యాలో.. నెత్తిమీద సూర్యుడు ఉయ్యాలో..అంటూ మహిళలు బుధవారం ఆడుతూ పాడారు. కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, గ్రామాల్లో ప్రధాన కూడళ్ల బతుకమ్మలను పేర్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న నీటి కుండీలు, చెరువులు, కుంటలలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.


సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ..నోడల్ అధికారి షేక్ సలాం


ఎల్లారెడ్డిలో ..


తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో..


రామారెడ్డి అంగన్‌వాడీ కేంద్రంలో..


లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ..


గర్గుల్‌లో..


భిక్కనూరులో..


పెద్దకొడప్‌గల్‌లో నిమజ్జనానికి తీసుకెళ్తూ..


బాన్సువాడలో .. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఉద్యోగులు


జిల్లా కేంద్రంలోని ఆర్‌కే కళాశాలలో ..

ఆదర్శ రైతుల ఎంపిక.. సన్మానం


లింబారెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ ప్రతినిధులు


ప్రశంసాపత్రంతో ధర్మారెడ్డి


బుజ్జారెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ ప్రతినిధులు


ప్రశంసాపత్రాలతో బాన్సువాడ, బీర్కూర్ ఆదర్శ రైతులు


అవార్డును అందుకున్న భిక్కనూరు రైతు మల్లేశం

సదాశివనగర్/పిట్లం/భిక్కనూరు/బాన్సువాడ/తాడ్వాయి :లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డి ఆధ్వర్యంలో ఆదర్శ రైతులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. బుధవారం బోధన్ కమ్మ సంఘంలో బాన్సువాడ మండలం దేశాయిపేట్‌కు చెందిన జంగం బసప్ప, బీర్కూర్ మండలం కిష్టాపూర్‌కు చెందిన పెద్ది నర్సారెడ్డి, సదాశివనగర్‌కు చెందిన కోతి లింబారెడ్డి, తాడ్వాయికి చెందిన భీమన్నగారి ధర్మారెడ్డి, పిట్లం మండలం తిమ్మాపూర్‌కు చెందిన బుజ్జారెడ్డి, భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన అంబళ్ల మల్లేశంలను ఆదర్శ రైతులుగా ఎంపిక చేసి సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ..రైతు దేశానికి వెన్నెముక లాంటోడని, రైతు లేని సమాజం ఊహించలేనిదని, రైతు కష్టాన్ని గుర్తించాల్సి బాధ్యత మనందరిదని అన్నారు.

ఈ గ్రామాల్లో దసరాకు జెండా ఎగురవేస్తారు

మీకు తెలుసా..


రెడ్డిపేటలో గత దసరాకు ఎగురవేసిన జెండా..


ఇసన్నపల్లి హనుమాన్ మందిరం ముందు..

రామారెడ్డి: దసరా పండుగ అనగానే సెలవులకు స్వగ్రామాలకు వచ్చిన కుటుంబసభ్యులు, అతిథులతో గ్రామాలలో చుక్కా.. ముక్కతో ఎంజాయ్ చేస్తుంటారు. కానీ, ఈ గ్రామాలలో మాత్రం జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకుంటున్నారు.

- రామారెడ్డి మండలం ఇసన్నపల్లి గ్రామంలోని హనుమాన్ మందిరం ఎదుట దసరా నాడు జెండాను ఎగరవేసి జాతీయగీతాన్ని ఆలపిస్తారు. ఇదే గ్రామంలోని ఇసన్నపల్లి కషీర్ దగ్గర మరో జెండాను ఎగరవేస్తారు.
- రెడ్డిపేట గ్రామంలోనూ భారీ కట్టెతో తయారు చేసిన జెండాను ఎగురవేసి జాతీయగీతాన్ని ఆలపిస్తారు.
- ఈ ఆచారం ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు చెప్తున్నారు.
- రెడ్డిపేట గ్రామంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జాతీయ జెండాను కొన్నేళ్లపాటు ఎగురవేశారు.
- నక్సల్స్ ప్రభావిత గ్రామం కావడంతో జాతీయ జెండాకు బదులుగా తెల్లటి రంగు కలిగిన జెండాను ఎగురవేసినట్లుగా పూర్వీకులు చెప్తున్నారు.
- నిజాం పాలనలో ఉన్నప్పుడు వారు సూచించిన రంగు జెండానే ఎగురవేసేవారట.
- ప్రస్తుతం జిల్లాలోని పలు గ్రామాలలో దసరా రోజున సాయంత్రం జెండాను ఎగరవేస్తున్నారు. అనంతరం చావిడి వద్ద పూజలు చేసి జంబిని ఒకరికొకరు ఇచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెబుతుంటారు.

మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు

- రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీల అభివృద్ధికి రూ.15 కోట్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు, నాయకులు


బిచ్కుంద మున్సిపాలిటీ కార్యాలయం

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. బిచ్కుంద మున్సిపాలిటీగా ఏర్పాటై 5 నెలలు కావస్తోంది. నిధులు లేక ప్రజల సమస్యలు పరిష్కారానికి అధికారులు నానాతంటాలు పడుతున్నారని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీడీఎంఏ కార్యాలయం నుంచి అభివృద్ధి కోసం నిధులు మంజూరయ్యాయి. సీసీ, ఇతర రోడ్ల నిర్మాణం కోసం రూ.5 కోట్లు, మున్సిపాలిటీ భవనం నిర్మాణానికి రూ.3 కోట్లు, డ్రైనేజీ కోసం రూ.3.50 కోట్లు, కల్వర్టులు రూ.1.50, షాపింగ్ కాంప్లెక్స్ కోసం రూ.2 కోట్లు మొత్తం రూ.15 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం రూ.కోట్లలో నిధులు మంజూరు కావడంతో ప్రజలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లికార్జునప్ప షెట్కార్ ఎమ్మెల్యేకు, అధికారులు కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు. రెండవ విడతలో మరో రూ.15 కోట్లు నిధుల కోసం ఎమ్మెల్యే ప్రయత్న చేస్తున్నారని ఆయన తెలిపారు.

జీఎస్టీతో దేశప్రజలపై లక్షల కోట్ల భారం వేసిన మోదీ

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: కొత్తగా జీఎస్టీ అమలులోకి తెచ్చి దేశ ప్రజలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్షల కోట్ల భారం వేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ పేరుతో దేశ ప్రజల నుంచి అక్రమంగా దోచిన రూ. 22 లక్షల కోట్ల నుంచి కేవలం రూ. 2 లక్షల కోట్లు తగ్గించి, ప్రజలకు ఏదో చేశామని బీజేపీ నాయకులు జబ్బలు చరుచుకుకుంటూ ఫోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణాలోని ప్రతి వ్యక్తికి నెలకు రూ. 5 వేలు మిగిల్చామని ఎంపీ అర్వింద్ అంటున్నారని, గత తొమ్మిదేళ్లలో తెలంగాణాలోని ప్రతి వ్యక్తి నుంచి రూ. 5,40,000 కేంద్రం దోచుకున్నట్లు ఒప్పుకున్నట్లే కదా అని పేర్కొన్నారు. ఎంపీలు ఏం మొహం పెట్టుకొని మాట్లాడుతున్నారని, జీఎస్టీ పెట్టమని అడిగింది ఎవరని ప్రశ్నించారు. 2017 నుంచి కొత్తగా జీఎస్టీ తెచ్చి నిత్యావసర సరుకులు, అన్ని రకాల వాహనాలు, ఇతర వస్తువులపై ధరలు పెంచింది మీరు కాదా? అని అన్నారు. జీఎస్టీ పేరుతో మోసం చేస్తున్నదెవరో ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు ఓట్ల కోతలు పెట్టడం ఖాయమన్నారు.

డెర్మటాలజీ క్విజ్‌లో ద్వితీయస్థానం



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల ఫైనలియర్ విద్యార్థులు బోయిండల సూర్య, శశాంత్ కుమార్ జాతీయ స్థాయి క్విజ్ పోటీలో ప్రతిభ చాటారు. ఈ నెల 20న సూరత్‌లో నిర్వహించిన డెర్మటాలజీ క్విజ్‌లో వీరిద్దరూ ద్వితీయస్థానం సాధించారు. క్విజ్‌కి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షలు ఆగస్టు నెలలో ఆన్‌లైన్‌లో నిర్వహించగా, దేశవ్యాప్తంగా 100కి పైగా బృందాలు పాల్గొన్నాయి. అందులో ఫైనల్‌కు చేరిన జిల్లా మెడికల్ కాలేజీ విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబర్చారు. ఈ సందర్భంగా సూర్య, శశాంత్‌లను జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

క్రైం కార్నర్

మరిది చితి మంటలు ఆరకముందే వదిన మృతి

- చుక్కాపూర్‌లో విషాదం


కమల (ఫైల్)

మాచారెడ్డి: గల్ఫ్‌లో గుండెపోటుతో మరణించిన మరిది మృతదేహానికి అంత్యక్రియలు పూర్తయిన గంటల్లోనే వదిన మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. చుక్కాపూర్‌కు చెందిన ఎల్లయ్య బతుకుదెరువు కోసం బహ్రెయిన్ వెళ్లిన మూడు నెలలకే గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహం మంగళవారం ఇంటికి చేరుకోగా, కుటుంబీకులు అంత్యక్రియలు నిర్వహించారు. చితి మంటలు ఆరకముందే అన్న భిక్షపతి భార్య కమల(46) అనారోగ్యంతో బుధవారం మరణించింది. ఎల్లయ్య కర్మకాండలు చేయకముందే కమల చనిపోవడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. కమలకు కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు ..


రాజు (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో విద్యుదాఘాతంతో బుధవారం ఒకరు మృతి చెందారు. గ్రామానికి చెందిన శేకెల్లి రాజు(40) ఉదయం తన పొలంలోని బోర్ మోటార్ సమీపంలో గడ్డి కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగిపడి కటింగ్ యంత్రానికి తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురైన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..


రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

నిజామాబాద్ రూరల్: మోపాల్ మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన అంగలి రామ్మోహన్ రెడ్డి(45) మద్యా నికి బానిసై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు బుధవారం తెలిపారు. రామ్మోహన్‌రెడ్డి మద్యానికి బానిసకావడంతో కుటుంబ సభ్యుల సూచన మేరకు రెండు నెలలు గా మద్యం మానేశాడు. ఈ నెల 22న ఇంటి పక్కన గుర్తు తెలియని పురుగుల మందు తాగుతుండగా గమనించిన కుమార్తె అతని చేతిలోని సీసాను లాగేసింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు ఎస్సై సుశ్మిత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో కామారెడ్డి జిల్లా వాసి హత్య!



తిరుపతి అర్బన్/రాజంపేట: తిరుపతిలో కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన తిమ్మన్నగారి సతీశ్‌కుమార్ (32) హత్యకు గురయ్యాడు. బ స్టాండ్‌కు ఎదురుగా రైల్వే ట్రాక్‌పై సతీశ్ మృతదేహాన్ని రైల్వే పోలీసులు బుధవారం గుర్తించారు. సతీశ్ కుమార్ ఓ ప్రై వేటు పాఠశాలలో పీఈటీగా పనిచేసేవాడు. గతేడాది ఆగస్టులో వివాహం జరిగింది. ఈ నెల 22న తిరుపతికి వెళ్లిన సతీశ్ హత్యకు గురయ్యాడు. మృతదేహంపై గాజు బాటిళ్లతో కొట్టిన గాయాలు ఉన్నాయని, హత్యగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై మహేశ్

వర్ని: మండలంలోని మల్లారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన జంపాల అనిల్‌కుమార్, ఆయన భార్య పని నిమిత్తం బుధవారం ఉదయం వర్నికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి 6 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి, రూ.49,500 నగదు అపహరించారు. బుధవారం సాయంత్రం అనిల్‌కుమార్ ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగిన విషయాన్ని గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని, క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. అనిల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఒకరు మృతి


రాజమల్లు (ఫైల్)

ధర్పల్లి: మండలంలోని నడిమితండా పంచాయతీ పరిధిలోని కర్నల్ తండా వద్ద బుధవారం ఆర్టీసీ బస్సు, బైక్‌పైకి దూసుకెళ్లడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం .. హొన్నాజీపేట్ గ్రామానికి చెందిన మిద్దెల రాజమల్లు (42) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం తన కూతురిని కామారెడ్డి జిల్లా పోసానిపేటలోని అత్తవారింట్లో దింపి బైక్‌పై హొన్నాజీపేట్‌కు తిరుగుప్రయాణం అయ్యాడు. మార్గమధ్యలో కర్నల్ తండా వద్ద బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో రాజమల్లు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు ప్రయత్నించగా మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పర్యాటకులకు తప్పని తిప్పలు


ప్రాజెక్ట్‌పైకి అనుమతించకపోవడంతో గేట్ వద్ద పర్యాటకులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అందాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులకు తిప్పలు తప్పడం లేదు. ఎంతో ఆశతో వచ్చిన పర్యాటకులు డ్యాంపైకి వెళ్లేందుకు అధికారులు అనుమతివ్వడం లేదు. దీంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రాజెక్టుపైకి అనుమతివ్వకపోవడంతో దిగువన గోదావరి అంచునకు వెళ్తున్నారు. దీంతో పర్యాటకులు ప్రమాదాల బారినపడే ఆస్కారం ఉంది.

డిపాజిట్ల పేరిట రూ. 8.5 కోట్ల టోకరా

- యూఎస్ డాలర్, క్రిప్టో కరెన్సీ, ట్రేడింగ్ అంటూ ఆన్‌లైన్ దందా
- ఇద్దరు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి

ఖలీల్‌వాడి: అనుమతి లేకుండా కంపెనీలు పెట్టి 125 మంది నుంచి డిపాజిట్ల పేరిట డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు క్రైం బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర చారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీసీఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరంలోని హస్మీ కాలనీకి చెందిన మొయిజ్ ఖాన్, మహమ్మదీయ కాలనీకి చెందిన సయ్యద్ మహ్మద్ హాసన్ ఇద్దరు స్నేహితులు. 2022-23లో షైన్ ఎవర్ గ్రీన్ కంపెనీ పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. తమ కంపెనీలో డిపాజిట్ పెడితే రూ. లక్షకు 10 శాతం వరకు అందిస్తామని నమ్మబలికారు. కొంతమంది మిత్రులు, ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని 125 మంది నుంచి రూ.8.5 కోట్ల డిపాజిట్లు సేకరించారు. ఆ తర్వాత మొయిజ్‌ఖాన్, సయ్యద్ మహ్మద్ హాసన్‌లు డిపాజిటర్లకు డబ్బులు చెల్లించడంలో జాప్యం చేస్తూ వచ్చారు. డిపాజిటర్లు ఒత్తిడి చేయడంతో మకాం మార్చారు. దీంతో ఇందల్వాయి మండలంలోని లోలం గ్రామానికి చెందిన హకీం ఫిర్యాదు చేయడంతో సీపీ పోతరాజు సాయిచైతన్య కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. కేసు దర్యాప్తు అనంతరం మొయిజ్‌ఖాన్, సయ్యద్ మహ్మద్ హాసన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

మకాం మార్చిన నిందితులు

మొయిజ్‌ఖాన్, సయ్యద్ మహ్మద్ హాసన్‌లు నిజామాబాద్ నుంచి మకాం మార్చి మహారాష్ట్రకు వెళ్లారు. అక్కడి నుంచి ఆన్‌లైన్‌లో క్రిప్టో, యూఎస్ డాలర్, ట్రేడింగ్ పేరిట యాప్ ద్వారా వసూళ్లకు తెర లేపారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని మీటింగ్‌లు ఏర్పాటు చేశారు. కాగా, వీరి వలలోపడి ఎంతమంది ప్రజలు మోసపోయారో తెలియాల్సి ఉందని ఏసీపీ నాగేంద్రచారి తెలిపారు. మరోవైపు హైదరాబాద్‌లో ఓ భూమిని నిందితులిద్దరూ కలిసి కొనుగోలు చేసి రూ. 25 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐలు రవీందర్, సురేశ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వర్ని: మండలంలోని శ్రీనగర్ వాగు వద్ద బుధవారం సాయంత్రం జరిగి న రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనగర్ గ్రామానికి చెందిన వాగ్మోరే సుభాష్, సిందిగిడి ఉమాకాంత్ బైక్‌పై వర్ని నుంచి శ్రీనగర్ వెళ్తుండగా, నిజామాబాద్ నుంచి వస్తున్న కారు ఢీకొన్నాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.